క్లుప్తంగా

ఘనంగా గోకనకొండ తిరునాళ్ల



వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలం గోకనకొండ గ్రామం నందు శ్రీ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. స్వామి వారి తిరునాళ్లను పురస్కరించుకుని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్రభలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవాల యజమానికి ఆర్థికసాయం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల గ్రామంలో ఇటీవల మర్రి గంగయ్యకు చెందిన గొర్రెలు కుక్కల దాడిలో మరణించాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జీవాల యజమాని గంగయ్యకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. ఈ సంఘటనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకతే సృష్టికర్తగా మారేందుకు దోహదం

తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ



యడ్లపాడు: సృజనాత్మకంగా యువత ఆలోచన చేసినప్పుడే క్రియేటర్స్‌గా మారతారని తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ చెప్పారు. మండలంలోని లింగారావుపాలెంలో డీవైఎఫ్ఐ 44వ సంక్రాంతి సాంస్కృతిక క్రీడా సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ కన్వీనర్ శ్రీనివాస్ గారు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తానా ఫౌండేషన్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వెల్లడించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు, గ్రామపెద్దలు ఆలోకం పెద్దబ్బయ్య మాట్లాడిన వారిలో ఉన్నారు. తానా ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన 10 మంది మహిళలకు తానా ఫౌండేషన్ ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేసింది. పోటీల నిర్వహణకు ఆర్థిక సాయమిచ్చిన ఎన్నారై ఆలోకం శ్రీరామ్ తండ్రి అమరలింగ స్వామి చేతుల మీదుగా విజేతలకు బహుమతుల్ని అందజేశారు.

క్రీడలతోనే గ్రామాల మధ్య ఐక్యత భావం

పుడమి గ్రూప్స్ అధినేత ముత్తవరపు సురేష్, అరుణకుమారి దంపతులు



యడ్లపాడు: క్రీడలు గ్రామాల మధ్య ఐక్యతను అన్ని వర్గాల మధ్య సఖ్యతను నిర్మిస్తాయని పుడమి గ్రూప్స్ అధినేత ముత్తవరపు సురేష్ బాబు, అరుణకుమారి దంపతులు తెలిపారు. యడ్లపాడు రచ్చబండ సెంటర్లో సంక్రాంతి సందర్భంగా పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను వారు ప్రారంభించారు. యువకులు, మహిళలు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో రూ.2,516, రూ.2,116, రూ.1,516, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, జ్యూరీ కింద మరో ఇద్దరికీ రూ.1,116 చొప్పున నగదు, షీల్డ్ అందజేశారు. మిగిలిన విభాగాల్లో బహుమతులు, షీల్డ్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ముత్తవరపు భార్గవిచౌదరి, పృథ్వీ దంపతులు, ముత్తవరపు రామారావు, పద్మారావు, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు కృష్ణ, భవాని, కోకికమారుతీ, బోడి పద్మావతి, జరుగుల శంకరావు, నంబూరి శ్రీనివాసరావు, విజయ్‌బాబు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన దొంగ అరెస్టు

చిలకలూరిపేటటౌన్: ద్విచక్రవాహనాలు చోరీకి పాల్పడే వ్యక్తిని రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామానికి చెందిన కత్తి రాంబాబు డిసెంబర్ నెల 24వ తేదీ మండలంలోని బొప్పూడి ఆంజనేయస్వామి గుడి సమీపంలో నిలిపి ఉన్న హీరో గ్లామర్ మోటార్ బైక్‌ను చోరీ చేశాడు. ఈ క్రమంలో వాహన యజమాని కరగాం శ్రీనివాసరావు ఈ నెల 13వ తేదీ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్ఐ రవికృష్ణ సిబ్బంది దర్యాప్తు చేపట్టి కత్తి రాంబాబును సోమవారం ఇంటి వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుండి రూ. 4లక్షలు విలువ చేసే 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రతి ఇంట్లోనూ సంక్రాంతులు

- ఆలయాలకు విద్యుత్ శోభ
- దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు
- బంధుమిత్రులతో పల్లెలు కళకళ

యడ్లపాడు: సంక్రాంతి, కనుమ పండుగలను మండల ప్రజలు సోమ, మంగళ వారాలు రెండు రోజులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పట్టణాల్లో ఉన్న బంధుమిత్రులు, కొత్తఅల్లుళ్ల ఒక్కసారిగా పల్లెలకు తరలిరావడంతో ఊళ్లన్నీ కళకళలాడాయి. ప్రతిఇంటా పసుపు, కుంకుమ, రంగవల్లుల అలంకరణతో సంక్రాంతి శోభ తొణికిసలాడింది. సంక్రాంతి అతిథులు హరిదాసులు, డూడూ బసవన్నలు, జంగదేవరలు, కొమ్మదాసరిలు, చిన్నారుల ఆకాశాన ఎగరేసిన పతంగులు, ముంగిళ్ల రంగవల్లులు పల్లెల్లో సందడి చేశాయి.

పరవశంగా పశువుల పండుగ

మండలంలో పశువుల పండగను ఆదివారం నిర్వహించారు. అన్నదాతలు ఆరుగాలం కష్టానికి తగిన ప్రతిఫలం సంక్రాంతికి ఇంటికి చేరింది. రెక్కల కష్టంలో చేదోడుగా నిలిచి శ్రమకోర్చిన పశువులకు అన్నదాతలు సమున్నత గౌరవమిచ్చారు. కనుమ పండగ రోజున పశువులను శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులు పూశారు. పసుపు, కుంకుమలతో బొట్లు పెట్టి వాటి మెడలో ఘల్లుఘల్లు మనే మువ్వల పట్టీలు కట్టారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట రూరల్: సంక్రాంతి సంబరాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. సంబరాలలో భాగంగా దొండపాడులో మూడు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ పోటీలు ముగిశాయి. గ్రామ సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. అలాగే మహిళలకు ముగ్గుల పోటీ, చిన్నారులకు డాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. లైఫ్‌లైన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పేరం రాజనందరెడ్డి విజేతలకు బహుమతులు అందించారు. పెదరెడ్డిపాలెంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహించారు. షటిల్, క్యారమ్స్, చెస్, ముగ్గుల పోటీ, స్లోసైక్లింగ్, స్లో బైక్, మ్యూజికల్‌చైర్స్, క్విజ్, లెమన్‌స్పూన్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో కనుమ పండుగను పురస్కరించుకుని గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, అర్చకస్వాములు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో సోమవారం, మంగళవారములలో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు తమ లోగిళ్ళ ముందు రంగులతో రంగవల్లికలను దిద్ది స్వాగతం పలికారు. హరిదాసుల సంకీర్తనలతో, గంగిరెద్దుల విన్యాసాలతో ఈ పండుగ సాగింది. ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: తెలుగు లోగిళ్లలో అతి పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామగ్రామాన సంబరాలు అంబరాన్నంటాయి. దేశవిదేశాల్లో ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన ప్రజలు సొంతఊళ్లకు చేరుకోవటంతో గ్రామాలు కళకళలాడాయి. మండలంలోని సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటూ సంక్రాంతి పోటీలు జరిగాయి.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: సంక్రాంతి పండుగను భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా మండల ప్రజలు జరుపుకున్నారు. వేకువజామునే ఇంటి ముంగిట రంగవల్లులు, గొబ్బెమ్మలతో హరిదాసు కీర్తనలతో గ్రామాల్లో కోలాహలంగా జరిగాయి. రైతుల లోగిళ్లలో పంట చేతికొచ్చి ధాన్యపు రాశులతో, దూరప్రాంతంలో ఉన్న కుటుంబ సభ్యులు ఈ పండుగకు ఒకేచోట కలవడం ఆనవాయితీ కావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో ఈ పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు, కోలాటం ప్రదర్శించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, తనయుడు బొల్లా గిరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో సంబరాలు మిన్నంటాయి.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల) : కనుమ పండుగ సందర్భంగా నూజెండ్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం నందు అర్చకులు క్రోసూరి రామ్మోహనాచార్యులు గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: మండలంలో అన్నీ గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ వేడుకలు సంబరాలు అంబరాన్ని అంటాయి. రైతుల ఇళ్ళలో ధాన్యపు రాశులు, ఇళ్ల ముందు రంగుల ముగ్గులు, గొబ్బి మ్మలు, సంస్కృతులు, సంప్రదాయాల నడుమ వేడుకలు ప్రజలు వైభవంగా నిర్వహించారు. యువతీ, యువకులు సంప్రదాయ దుస్తులు ధరించి తమ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు.

గడుపూడి నరసయ్య-పాపమ్మ కుటుంబ సభ్యులు



కుటుంబమంతా ఒక్కటిగా...

శావల్యాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల కేంద్రం శావల్యాపురంలో గడుపూడి నరసయ్య-పాపమ్మ కుటుంబ సభ్యులు పండుగ వేడుకలు ఉమ్మడిగా చేసుకున్నారు. ఈసందర్భంగా గడుపూడి వెంకట్రాయుడు, బిక్షావతి దంపతులు మాట్లాడుతూ నాలుగు తరాలుకు చెందిన 18 కుటుంబాలకు వారందరూ 65 మంది కలిసి ఉమ్మడిగా పండుగ వేడుకలు జరుపుకోవటం సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా ఉండటం చాలా ఆనందంగా ఉందన్నారు. పిండి వంటలతో, ఆటపాటలతో కుటుంబ సభ్యులు ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఆచార్య ఎంజీ రంగా వ్యవసాయ శాస్త్రవేత్తల కమిటీ సభ్యులు చెరుకూరి శ్రీనివాసరావు, చెరుకూరి కోటినారాయణ, గడుపూడి విశ్వనాథం, జాలాది నాగప్రసాదు, గోరంట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కె-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం

ప్రారంభించనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి గ్రూప్ సంస్థల డైరెక్టర్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో, అధునాతన బోధనా పద్ధతులతో ఏర్పాటు చేసిన కె-రిడ్జి ఇంటర్నేషన్ స్కూల్‌ను ఈనెల 17వతేదీ బుధవారం దేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు.విలేకరుల సమావేశంలో నాతా ని మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో, అంతర్జాతీయ స్థాయిలో కూడిన అధునాతన బోధనా పరికరాలతో స్కూల్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యతో పాటుగా అదే స్థాయిలో విద్యార్థి అభిరుచికి తగినట్టుగా లలిత కళలు, క్రీడలు తదితర అంశాలలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా కె-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో విజేతలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో స్కూల్ అకడమిక్ డైరెక్టర్ బర్నబాస్, ప్రిన్సిపల్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చు

పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ సిరాజ్



బ్రదర్ సిరాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేటటౌన్: ఆత్మవిశ్వాసం ద్వారానే మానవుడు అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలడని పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ సిరాజ్ ఉర్ రెహమాన్ చెప్పారు. పట్టణంలోని పాత పశువుల సంత పక్కన గోల్కొండ గార్డెన్స్‌లో నేను సైతం సమాజం కోసం అనే కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. బ్రదర్ సిరాజ్‌కు చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రదర్ సిరాజ్ మాట్లాడుతూ సమాజంలో వ్యభిచారం, అవినీతి వంటి రుగ్మతలు పెచ్చరిల్లి పోయాయని, వాటి ద్వారా అరాచకం ప్రబలిందని తెలిపారు. ప్రతి మనిషి సమాజంలో అందరి బాగు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న మల్లెల రాజేష్ నాయుడు మాట్లాడుతూ సమాజం కోసం నేనేం చేయాలి అనే ఆలోచన తన మనసులో ఎప్పుడు మెదలుతూనే ఉంటుందన్నారు. తన వంతు బాధ్యతగా కులమతాలకు అతీతంగా సమాజ సేవ చేస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయాల ద్వారా సేవా పరిధిని విస్తృతం చేసే అవకాశం ప్రస్తుతం తనకు లభించిందని.. తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. కులమతాలకు అతీతంగా వేలాది మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఘనంగా ఇరుముడి మహోత్సవం

చిలకలూరిపేట: పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో ఉన్న పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో అయ్యప్పమాలధారణ చేసిన స్వాముల ఇరుముడి మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్నపరెడ్డి సురేష్ స్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. శబరిమల యాత్రకు బయలు దేరుతున్న స్వాముల ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ చెంబేటి భారతి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు పంగులూరి వెంగళరాయుడు, ఊసా రమేష్, కోటా నాగపూర్ణచంద్రరావు, పండబ్బాయి, లంకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామ చరిత్ర నేటి యువతకు ఎంతో అవసరం

- ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివ రావు
- దింతెనపాడు గ్రామ చరిత్ర గ్రంథం ఆవిష్కరణ
- రచయిత కృషిని అభినందించిన పలువురు వక్తలు



దింతెనపాడు చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించిన అతిథులు

యడ్లపాడు: అపార అనుభవం, కఠోర శ్రమ, విలువైన సమయాన్ని వెచ్చించి గ్రామ చరితను భావితరాలకు అందించడం అసామాన్యమైన విషయమని ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు చెప్పారు. హేతవాద రచయిత, ఉపాధ్యాయులు మేడూరి సత్యనారాయణ రాసిన పరిశోధన గ్రంథం 'దింతెనపాడు గ్రామ చరిత్ర' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎందరో విద్యావేత్తలను అదించిన దింతెనపాడు చరిత్రగా రావడం భావి తరాలకు చాలా అవసరమన్నారు. నేడు శంకుపుష్పంగా పిలిచే ఔషధాల తయారీకి ఉపయోగించే తీగజాతి సీలిరంగు పూలమొక్క నామమే తమ గ్రామం పేరుగా మారిందని రచయిత మేడూరి సత్యనారాయణ చెప్పారు. 11వ శతాబ్దం నాటి 'దింటెనపాడు' ఉప్పవాగు ఒడ్డునే ఉన్న అగ్రహారమని, అనేక వరదల కారణంగా 120 ఏళ్ల కిందట వాగు దక్షిణ భాగంలోని బుద్దం వారి చెరువు సమీపాన అప్పటి పెద్దలు నిర్మించినట్లు తన పరిశోధనలో తెలిసిందన్నారు. శాసనపరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, సినీ నటులు చిట్టినేని లక్ష్మీనారాయణ, కవిరాజు సాహితి సమితి అధ్యక్షులు ఆలోకం పెద్దబ్బయ్య, విశ్రాంత లెక్చరర్ కుదారి జగదీశ్వరరావు విద్య మనిషిని ఉన్నతంగా మార్చుతుందనేందుకు తమ జీవితలే సాక్ష్యమన్నారు. గ్రంథ రచయిత భార్య రావి నాగేశ్వరీ సభాధ్యక్షత వహించి గ్రంథ సమీక్ష చేయడం తామెవ్వరు ఇప్పటి వరకు చూడలేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మేడూరి యామిని, శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, షేక్ బాబు, దేవరపు వీరాంజనేయులు, దేవరపు చౌదరి, గళ్ళా కోటేశ్వరరావు, బొందలపాటి పూర్ణచంద్రరావు, రాజేంద్రప్రసాద్, నంబూరి నాగేశ్వరరావు గ్రంథంలోని అంశాలను సమీక్షించి రచయితను అభినందించారు.

టీడీపీ దాడులను ఖండించిన ఎమ్మెల్యే బొల్లా

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ



గాయపడిన యువకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఒక పథకం ప్రకారం మాజీ ఎమ్మెల్యే చేస్తున్న దాడులను ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు ఖండించారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకులను మంగళవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు పి.ఎస్ ఖాన్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. నారా చంద్రబాబు, లోకేష్ ఆదేశాల ప్రకారం గ్రామాలల్లో ఎస్సీ, ఎస్టీ బీసీలపై దాడులకు ప్రోత్సహించడం బాధాకరమన్నారు. ఎక్కువగా వెనుక బడిన వర్గాలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారనే అక్కసుతో దాడులు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు తన అనుచరులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని, నియోజకవర్గ ప్రజలు సంయమనం పాటించాలన్నారు. టీడీపీ దాడులకు ఎవరూ భయపడవద్దని, తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పోలీసులు విచారణ చేసి నిందితులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాదెండ్ల: సంక్రాంతి పండుగ వేళ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గణపవరం జాతీయ రహదారిపై రాజీవ్ గాంధీకాలనీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా కంభం గ్రామానికి చెందిన అచితాపురం రవి (58) పదిహేనేళ్ళ క్రితం భార్యతో కలిసి గణపవరంలో నివాసం ఉంటూ స్థానిక హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారిని దాటుతుండగా చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్ప గించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యం



సొలసలో జలజీవన్ మిషన్ పనుల్ని ప్రారంభించిన దృశ్యం

యడ్లపాడు: ప్రతిఇంటికీ సురక్షిత తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి చెప్పారు. సొలస గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో బోర్లద్వారా నీటి సరఫరాకు పైపులైన్లు, చెరువు నీటిని పంచాయతీ కుళాయిలకు శుద్ధి చేసి సురక్షిత తాగునీటిని అందించేందుకు మైక్రోఫిల్లర్లను కొత్తగా ఏర్పాటు చేశారు. జల జీవన్ మిషన్ రూ.13.38 లక్షలు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు బాపతు ఎరుగూటి వేణుగోపాలరెడ్డి సొంత నిధులు రూ.5 లక్షలు వెచ్చించి నిర్మించిన వీటిని మంగళవారం సర్పంచ్ దావల వెంకన్న ప్రారంభించారు. సురక్షిత నీటిని అందించేందుకు తన సొంత నిధులు ఇచ్చిన వేణుగోపాల్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు అవుడూరి రోశిరెడ్డి, బాపతు సీతారామిరెడ్డి, కేశవరెడ్డి, మద్దురి శివరామకోటిరెడ్డి, పాలూరి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గ్రామస్తులు ముద్దం శ్రీనివాసరెడ్డి, మద్దురి సంజీవరెడ్డి, బాపతు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మకర జ్యోతి దర్శనం

- కోలాహలంగా సాగిన తిరువాభరణాల ఊరేగింపు
- అయ్యప్ప శరణుఘోషతో పులకించిన పట్టణం



తిరువాభరణములను ఊరేగింపుగా తీసుకువెళుతున్న అయ్యప్పలు



అలంకరణలో అయ్యప్పస్వామి వారు



ప్రత్యేక అలంకరణలో ఎస్ఎస్‌పీ కాలనీ అయ్యప్పస్వామి



అయ్యప్పస్వామి ఆలయం వద్ద మకర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం మకర విలక్కు (జ్యోతి) దర్శనం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి రాత్రి స్వామివారి జ్యోతి దర్శనం భక్తులకు కలిగించారు. ఈసందర్భంగా స్వామి వారి తిరువాభరణముల గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎస్ఎస్‌పీ కాలనీ శివాలయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గణపతి హోమం నిర్వహించి తిరువా భరణములను ఊరేగింపుగా సత్తెనపల్లి రోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయానికి తీసుకువచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై అయ్యప్పస్వామి ఉత్సవమూర్తితో మేళతాళాలతో ఊరేగింపు సాగింది. ఊరేగింపు ముందుగా మూడు చెక్కపెట్టెలలో స్వామి తిరువా భరణములను అయ్యప్ప మాలధారులు తమ తలపై మోసుకుంటూ తీసుకువచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరిన తిరువాభరణాలు సాయంత్రం ఆరు గంటలకు ఆలయానికి చేరుకున్నాయి. ఆభరణాలను స్వామివారికి అలంకరించి దివ్య తిరువాభరణ అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే స్వామి వారి దివ్య జ్యోతి దర్శనంతో భక్తులు పులకించారు. అనంతరం గజమాలతో అలంకరించిన దివ్య పదునెట్టాం పడిపూజ అయ్యప్ప పాటలు, శరణుఘోషల తో సాగింది. జయాది హోమాలు నిర్వహించి పూర్ణా హుతి సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి వెంకట శివవేణుగోపాల్, కార్యదర్శి చేబ్రోలు ఫణికుమార్, కోశాధికారి మైలవరపు ధనుంజయరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సెలవులు లభించడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతానికి చేరుకున్నవారితో సందడి వాతావరణం నెలకొంది. వరుస పండుగల నేపథ్యంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, సంఘాలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు, క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

- దేవతల జలవిహారం.. భక్తులకు పారవశ్యం
- జాలాది, లింగారావుపాలెం గ్రామాల్లో వేడుకగా తెప్పోత్సవం



లింగారావుపాలెం పుష్కరిణిలో నిర్వహిస్తున్న దేవతామూర్తుల తెప్పోత్సవం

యడ్లపాడు: మకర సంక్రాంతి పర్వదినాన జరిగే గోదా కల్యాణం అనంతరం నిర్వహించే శైవ, వైష్ణవ మతాలకు చెందిన దేవతా మూర్తులు జల విహార వైభవ ఘట్టం అంగరంగ వైభవంగా జరిగాయి. భారతీయ సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ అపూర్వ ఘట్టానికి మండలంలోని జాలాది, లింగారావుపాలెం గ్రామాలు వేదికయ్యాయి. పండితుల వేదమంత్రాలు.. భక్తుల శివగోవింద నామస్మరణల మార్మోగుతుండగా పుష్కరిణిలో సీతారాములు, శివపార్వతులు సుందర అలంకరణలో పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

లింగారావుపాలెంలో..

ఊరిమధ్య కొలనులో శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, సీతారామ దేవస్థానాల ధర్మకర్తలు, ఊరిపెద్దలు సంయుక్తంగా తెప్పోత్సవ కార్యక్రమాన్ని ఏటా సంక్రాంతి నాడు నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా మూల విరాట్‌లతో పాటు ఉత్సవ మూర్తుల్ని అర్చకులు విశేష అలంకరణ గావించారు. పుణ్యాహవచనం, సంప్రోక్షణ, గోపాసన పూజలు, గ్రామోత్సవం నిర్వ హించి అనంతరం జలవిహార విహార ప్రక్రియను కొనసాగించారు. వీటిని తిలకించేందుకు ఊరంతా చెరువు వద్దకు చేరి అందమైన పుష్కరిణిలో కార్యక్రమాన్ని తిలకించి పరవశించారు.

జాలాదిలో...

జాలాది గ్రామం హరహత దత్త క్షేత్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి, గంగ పార్వతి సమేత శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని శైవవైష్ణవ ఆలయాలకు భారీ విద్యుత్తు దీపాలను అలంకరించారు. అర్చకులు పండుగ పూజలు చేసి పలు రకాల తీర్థప్రసాదాల్ని పంపిణీ చేశారు. అనంతరం సమీపానే ఉన్న చెరువులో పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన బల్లకట్టుపై తెప్పోత్సవం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, చంద్రశేఖర్, శరత్, రాము, వాసు, శివరామకష్ణ, జరుగుల శేషగిరిరావు, మానం శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



గణపవరం జెడ్పీ హైస్కూలులో పూర్వ విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాఠశాల మొత్తం కలియ తిరుగుతూ, తరగతిగదులలో ఉపాధ్యాయులతో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరిపై ఒకరు అప్పటి జోక్స్, నిక్ నేమ్‌లు పిలుచుకుంటూ సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో హాజరై వారి జీవన విధానము గురించి వివరిస్తూ తమను, వారి కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి తాము ఈ స్థాయికి రావడానికి కారకులైన ఆనాటి ఉపాధ్యాయులు కోటయ్య స్వామి, రసూల్, వేణుగోపాలరావు, వీరాంజనేయులు, మురళీధర్ రావు, సరళ, అప్పలరాజు, మహబూబ్ సుభానీ, చింతా పుల్లయ్య, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావులను పూల మాలలతో, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి నూతన వస్త్రములను బహూకరించారు. తొలుత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కురుగంటి పిచ్చిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గణపవరంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా నిర్వహించారు. 1990-91 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమావేశమయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలతో పాటూ సాఫ్ట్‌వేర్, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారు తమ అనుభవాలు పంచుకున్నారు. తాము చదువుకున్న ఉన్నత పాఠశాలకు ఏదో విధంగా సాయపడాలని తీర్మానించారు. ప్రతి ఏడాది ఆగస్టు 15న విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ చేయనున్నారు. వచ్చే సంక్రాంతి నాటికి పాఠశాలకు ఆర్థికంగా సాయం చేసేందుకు బ్యాంకులో ఖాతా తెరిచి కొంత మొత్తాన్ని పాఠశాలకు అప్పగించాలని నిర్ణయించారు.